# వెండి రూపాయి

వెన్నెల వెండిరూపాయిలాగ కనిపించింది అప్పల కొండకి.

ఆ పక్కింటి కాలేజీ అమ్మాయికి, ముందింటి పంతులుగారికి, వీధి చివరి తోతారామ్ పాపాలాల్ జువెలర్స్‌కి, మీదింటి కాలేజీగర్ల్ విశాలాక్షికి ఈ యొక్క చందమామ వరసగా చుద్వాలాగ, పరమాన్నంలాగ, వెండి కంచంలాగ, మల్లెపూవులాగ కనిపించింది.

చందమామ రోజూ వస్తున్నాడు.

వెన్నెల ప్రతిసారీ విరుస్తోంది.

కాని అప్పలకొండకి ఆరేళ్ళ తర్వాత ఆరోజే వెండిరూపాయి కనిపించింది.

పంజాబీ అమ్మాయి భర్త నీఫా నుంచి చైనా వారితో హోరాహోరీ పోరాడి ఆరోజే ఇంటికి వచ్చాడు.

పంతులుగారు పరుశువాకంలో వార్షికానికి వెళ్ళారు.

తోతారామ్ పాపాలాల్‌కి వెండికంచాల వ్యాపారానికి లైసెన్స్ వచ్చింది.

కాలేజీ గర్ల్‌కి రెండేళ్ళ కాలేజీ జీవితంలో మొదటి ప్రేమలేఖ, అందులో వాడిన మల్లెపూవు వాపసు వచ్చింది.

నులక మంచం మీద వెల్లకిలా పడుకొని ఆశ అంత విశాలమయిన ఆకాశాన్ని చూస్తున్నాడు అప్పలకొండ.

రెండిళ్ళవతల సీతప్పన్న పెళ్ళాం ఏలుతల్లి మొగుణ్ని తిడుతూ ఏడుస్తోంది.

అర్ధరాత్రి గుండె పగిలేట్టు ఆకలితో అరుస్తున్న బిచ్చగాడి గొంతు వెన్నెల సంతోషాన్ని ఉరితీస్తోంది.

చీకటి చిలికిపోయి బీదవాళ్ళ మనస్సుల్లోకి చేరిపోయింది.

ఆకాశం ధనికుడి వెక్కిరింతలాగ, చిరునవ్వులాగ తెల్లగా ఉంది.

చందమామ చుట్టూ వెన్నెల సంతోషాన్ని పుక్కిలించిన పసిపాప చెక్కిలిలాగ ఉంగరం తిరిగింది.

ఇవన్నీ చూస్తూ అప్పలకొండ అనుకొన్నాడు కదా–

ఈ యెక్కి సీతప్పన్న, వాడి పెళ్ళాం, బిచ్చగాడూ – మొదలైన వాళ్ళంతా ఎంత కష్టాలు పడిపోతున్నారో? అని.

పాపం – వాళ్ళకి డబ్బులేదు. ఏం చేస్తారు?

ఉన్న డబ్బుతో సీతప్పన్న కల్లుతాగేస్తాడు.

కనీసం రూపాయయినా మిగుల్చుకోడు.

బిచ్చగాడికి రూపాయి ఎలా ఉంటుందో తెలీదు.

రూపాయి ఉంటే ఏం చెయ్యాలో తెలుసు.

వాడూ కల్లుతాగుతాడు వెధవ!

నులకమంచం మీద నల్లులుకి అర్ధమయింది అప్పలకొండ సంతోషం.

రూపాయి కోసం అటూఇటూ తిరుగుతున్నాయి.

వాటిని చూసినా చంపలేదు అప్పలకొండ.

రూపాయి అంటే వాటికెంత ఇష్టమో! అని నవ్వుకొన్నాడు.

అవి కితకితలు పెడుతున్నట్టు వంటి మీద పాకుతున్నాయి.

రెండు నల్లుల్ని రూపాయి మీదకి ఎక్కించి విడిపించాడు.

రూపాయి చుట్టూ తిరిగి నల్లులు అలిసిపోయాయి.

ఆ నల్లులికి సీతప్పన్న, ఏలుతల్లి అని పేర్లుపెట్టి నవ్వుకొన్నాడు.

ఆకాశంలో గుండ్రటి వెండిరూపాయిల్లాంటి మేఘాలు, జార్జిరాజు టోపీల్లాంటి నల్లటి మచ్చ మేఘాలు కదిలిపోతున్నాయి.

అసలీ రూపాయి తనకి దొరక్కపోయేదే!

సంత నడిబొడ్డులో నలుగురి మధ్య నుంచి నడుస్తున్నప్పుడు ఠంగున కిందపడితే తక్కున మొదట వెనక్కి తిరిగింది తనే– తన దగ్గర ఉన్న పావలా జారిపోయిందేమోనని. తీరా అది జార్జిరాజు బొమ్మ ఉన్న రూపాయి. వెండి రూపాయి.

ఒక్క పిసరంతలో రూపాయి ఆవు కాలు కింద మాటుపడి పోయేదే. ఆవును తప్పించి చేతిలోకి తీసుకొనేసరికి చుట్టూ ఉన్న నలుగురూ చెదిరిపోయారు. ఎవరిదో రూపాయి? సంత మధ్య రూపాయి ఎవరిదంటే 50 మంది వస్తారు.

వెండి రూపాయి అప్పలకొండ పెళ్ళినాటి పెళ్ళాం నవ్వులాగ, ఫ్యాక్టరీలో మధ్యాహ్నం ఉచితంగా ఇచ్చే ఇడ్లీలాగ, తెల్లగా, ముచ్చటగా, అందంగా కనిపించింది. ఆలోచించి ఆలోచించి బనీనులోని లోపలి జేబులో దోపుకున్నాడు.

నులకమంచం కిర్రుమంటే భయం వేసింది. కిందికి చూస్తే పిల్లి బయటికి వచ్చింది. దాన్ని చూసేసరికి పొట్ట చెక్కలయ్యేంత నవ్వొచ్చింది అప్పలకొండకి. వెండిలాగా తెల్లగా మెరిసిపోతోంది పిల్లి.

వీధి చివరి ఆదికేశవులు కొట్లో – "మేరే మౌలాబూలా" పాట ఏభయ్యోసారి మళ్ళీ వినబడులోంది. శ్రోతల సౌకర్యానికని ఆ గ్రామఫోన్ అయిదేళ్ళుగా ఒక్కొక్క పదాన్ని పదేసి సార్లు విప్పి చెప్తూంటుంది. పాట పాడినప్పుడల్లా ఆదికేశవులు కుక్క మోరసారించి అరుస్తూంటుంది. ఆ పాటదానికి ఇష్టమని కేశవులు అంటాడు. పాట వినలేక బాధతో అరుస్తోందని నాయుడుగారు అంటూంటారు అటువేపు వెళ్ళినప్పుడల్లాను.

పాట విన్నాక పక్కున నవ్వుకున్నాడు.

ఇవాళ పాట కొత్తగా ఉంది.

"మేరే మౌలా బూలా" అని కాకుండా "నా బాకీ రూపాయేది" అన్న రికార్డుని కేశవులు వేస్తున్నాడనిపించింది.

"ఈ భటాచోర్ వెధవకి నా దగ్గర రూపాయున్నట్టు ఎలా తెలిసిపోయింది చెప్మా" అని ఆశ్చర్యపోయాడు.

ఆకాశంలో ఓ మూల నక్షత్రాలు ఆ మధ్య పార్శీబొమ్మలో చూసినట్టు వంకలుగా కాకుండా, జార్జిరాజు టోపీలాగ నలుచదరంగా కొసలు కొసలుగా ఉన్నాయి.

రెండిళ్ళవతలి ఇంట్లో ఉన్న దొరసాని తెలుగు పాటలు వినివిని ఖాయిలా పడింది.

దొర తాగివచ్చి ఆమెని కొడుతూంటాడు.

అందుకని పాటలు గట్టిగా పెడుతూంటాడు.

భారతదేశం అంటున్నారెవరో రేడియోలో.

భారత కాఫీ హోటల్లో కాఫీ తాగితే బావుణ్ణని అనుకొన్నాడు – అప్పలకొండ.

ఆ హోటల్లో కాఫీ చాలా రుచిగా ఉంటుంది – ఖరీదు ఎక్కువ కనక.

పెళ్ళాం సీతాలుకి ఇంకా రూపాయి విషయం చెప్పలేదు.

చెప్తే చాలా కోరికలు అడుగుతుంది.

నల్లటి పూసల పేరు కావాలి.

పేలాల ఉండలు కొనుక్కు తినాలి.

గునుపురం చీరె – నల్లటి రంగులో తెల్లటి రూపాయిల్లాంటి మచ్చలున్న చీరె – కావాలంటుంది.

నవ్వుకొన్నాడు అప్పలకొండ.

రూపాయి సంపాదించడం తెలీదు ఆడకూతురుకి. రూపాయి తగలపెట్టడం తెల్సు.

రోజుకి ఆరణాల డబ్బులు కూలివస్తుంది దానికి.

తను ఎప్పుడూ రూపాయి సంపాదించలేదని దానికి గుర్రు.

ఇటు పక్కకి వత్తిగిల్లితే రూపాయికి మంచంకోడు తగిలి గల్లుమంది.

పెద్ద మిలట్రీ బాండులాగ, ఆమధ్య ఎక్కడో వాయించిన పోలీసుబాండులాగ, అంజలీదేవి డ్యాన్సు పాటలాగ, అంతబాగా వినిపించింది అప్పలకొండకి.

"వెధవ రూపాయి – ఎంత అల్లరి చేస్తోంది" అని కడుపు మడతల మధ్య దాన్ని నిలబెట్టాడు.

నీడ కడుపంతా పడింది.

ఎంత పెద్దనీడో! అనుకున్నాడు.

అవును – పెద్ద జార్జి మహారాజుగారి నీడ – ఎంత పెద్దరూపాయలు అచ్చు వేయించాడు! చేటంత రూపాయలు – కడుపంతా రూపాయి నీడే!

మళ్ళీ కేశవులి బాకీ పాట వినిపిస్తోంది.

వాడి పెళ్ళాం కల్లుతాగి వచ్చి తిడుతోంది కేశవుల్ని.

"ఆడనంజకూతురివి తాగేసి నోటికొచ్చినట్టు నన్ను తిడతావేటే?" అని బ్రతిమాలుకొంటున్నాడు వాడు.

పెళ్ళానికి రోజూ రూపాయి కావాలి.

దాని కొడుకు చుట్టలకి రూపాయి కావాలి.

ఇంట్లో వంటా గట్రా చెయ్యడానికి ఒక రూపాయి.

"రూపాయి చుట్టూ పెపంచకం చుట్టేసుకు పోయింది" అనుకొన్నాడు అప్పలకొండ.

"వెధవ రూపాయి – ఎంతసేపు దీన్ని గడించడం" అని గిర్రున తిప్పి కిందికి విసిరాడు. అది ఇలా తిరుగుతూ వెళ్ళి ఇసికలో నిలబడింది.

కిలకిలలు పెట్టినట్టు నవ్వుతూ చుట్టుకుపోయాడు అప్పలకొండ.

దాని దగ్గరికి వెళ్ళి కూచొని "ఓసోస్ – పెద్ద మొనగాడిలా నిలబడ్డావేటే ఎర్రిదానా?" అని రూపాయిని ఎగరేసి ముద్దుపెట్టుకున్నాడు.

మళ్ళీ కేశవులి బాకీ పాట వినిపిస్తోంది.

"నా బాకీ రూపాయేదీ?"

అటు వెళ్ళినప్పుడల్లా నానా మాటలూ అంటాడు కేశవులు.

పెళ్ళాం మాటకి ఎదురు చెప్పలేని వెధవ రూపాయి కోసం కుక్కలా అరుచుకు వస్తాడు.

రూపాయిచ్చేస్తే రూపాయంత ముఖం చేసుకు నవ్వుతాడు.

కేశవులి పెళ్ళాం సోడాబుడ్డి బద్దలు కొట్టిన చప్పుడు వినిపించింది.

"ఓలమ్మో సంపేసినాదే – మక్కిరిగి పోనాది" అని కేశవులు అరిచాడు.

అప్పలకొండ మంచంమీద లేచి కూర్చున్నాడు.

రూపాయి మళ్ళీ ఇసుకలో నిలబడింది.

"నన్ను కొడతావ్రా దొంగ సచ్చినోడా?" అని సీతాలు అరుస్తోంది.

మళ్ళీ దబదబా వీపు బద్దలు కొట్టిన చప్పుడు వినిపించింది. గాలికి రూపాయి గిలగిలలాడింది.

అప్పలకొండ లేచి నిలబడ్డాడు.

"మళ్ళీ నడుమెత్తు విరిచేస్తాను" అని కేశవులు ఒగరుస్తూ అరిచాడు.

రూపాయి పక్కకి ఒరిగిపోయింది.

గబగబా అప్పలకొండ లాల్చీ తీసుకొని వీపుమీద ఉన్న కన్నంలోకి పొరపాటున తలదూర్చాడు. తన పొరపాటుకి రూపాయి నవ్వినట్టనిపించింది ఆ వెన్నెల వెలుగులో.

'చంపేసినాడూ' అని సీతాలు ఒకటే గోలపెట్టి ఏడుస్తోంది.

"నా బాకీ రూపాయేదీ?" పాటని కేశవులు ఆపలేదు.

పదిమంది పదిమాటలు అంటున్నారు.

త్వరత్వరగా రూపాయి జేబులో వేసుకొని అక్కడికి వచ్చాడు అప్పలకొండ.

సీతాలు నేలమీదపడి జుత్తు పీక్కొని ఏడుస్తోంది.

కేశవులు రొప్పుతున్నాడు.

"ఏటయిందేశ్ – దాన్నట్టా చంపుతావేటి?" అంటే.

"రూపాయి కావాలంట. తెల్లారాక ఓటట్టు కెళ్ళింది" అన్నాడు కేశవులు.

లోలోపల నవ్వుకున్నా, పైకి చాలా పెద్దవాడిలాగ విసుక్కొన్నాడు అప్పలకొండ.

"ఏటేశ్! ఎదవ రూపాయి కోసం దాన్ని సంపుతావ్?" అన్నాడు.

కేశవులికి ఉక్రోషమొచ్చింది.

"ఎల్లెలరా ఎదవ నాయాల. నువ్వు నాకు సెప్పేదేటి – రూపాయి సంపాదన నీకేటెరిక, ఉంటే నువ్వియ్యి" అన్నాడు.

అందరూ నవ్వారు.

సీతాలు కళ్ళు రూపాయలంత చేసుకు చూస్తోంది.

కేశవులి మాటలకి చురచురా మండిపోయాడు అప్పలకొండ.

"ఆడేటిత్తాడు. రూపాయి నెప్పుడన్నా చూసి ఏడిత్తేనా?" అని పోలిరాజు అన్నాడు సోడా తాగుతూ.

ఇక ఆగలేక పోయాడు అప్పలకొండ.

జేబులోంచి రూపాయి తీసి గోటి మీద తంగున మోగించి సీతాలు వేపు విసిరాడు.

"తీసుకు ఎల్లవే వెర్రిదానా – ఆడిచేత ఎందుకు దెబ్బలు తింటావ్?" అన్నాడు.

అక్కడున్న వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.

కేశవులు బాకీపాట ఆపేసి, ఒక్క క్షణం నిర్ఘాంతపోయాడు.

అప్పలకొండకి కొండ ఎక్కినంత ధైర్యం, సత్తా వచ్చాయి.

కేశవుల్ని కిళ్ళీ బడ్డీవేపు తోసి "ఎల్లరా గాడిద ఎదవా – ఆడదానిమీద సెయ్యి సేసుకొందుకు సిగ్గులేదా యేటి? రూపాయడిగితే రోడ్డు మీద తంతావా?" అని వరసగా చీవాట్లు పెట్టాడు.

అంత కేశవులూ చప్పగా చల్లారిపోయి కిళ్ళీకొట్టుమీద కూచొన్నాడు.

ఎప్పుడూ చొక్కాపట్టుకొని, బూతులు తిడుతూ కసిరే కేశవుల్ని అప్పలకొండ రెక్కపట్టుకొని తిరగదోస్తే కిక్కురు మనకుండా వెళ్ళి పోయాడు.

ఇక అందరి ముఖాలు చూడలేదు అప్పలకొండ.

చరచరా నడిచి వెనక్కు వచ్చేశాడు.

మంచం మీద పడుకొంటే మంచం కిర్రుమంది.

కడుపులో ఏదో కదులుతున్నట్లు ఆకలి ప్రారంభమయింది.

కళ్ళు మూసుకు పడుకొన్నాడు అప్పలకొండ.

నల్లులు కటుక్కున కరిచాయి.

తుళ్ళిపడి లేచాడు.

కేశవులి కొట్లోంచి "మేరే మౌలా బౌలా" పాట వినిపిస్తోంది. చందమామ వెలిసిపోయిన ముఖంలో వెక్కిరింతలాగ ఉన్నాడు.

అప్పలకొండకి ఆకలి వేస్తోంది.

చందమామ చపాతీలాగ, చక్కిలంలాగ కనిపించాడు.

నల్లులు కుడుతున్నాయి అప్పలకొండని.

వెన్నెల వెండిరూపాయిలాగ లేదు అప్పలకొండకి.

కాని ఆ పక్కింటి పంజాబీ అమ్మాయికి, ముందింటి పంతులుగారికి, వీధిచివరి తోతారామ్ పాపాలాల్ జువెలర్స్‌కి, మీదింటి కాలేజీగర్ల్ విశాలాక్షికీ ఈ యొక్క వెన్నెల ఇంకా వరసగా చద్దాలాగ, పరమాన్నంలాగ, వెండి కంచంలాగ, మల్లెపువ్వులాగ కనిపిస్తూనే ఉంది.

---